

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 27.0



చంటి బిడ్డను ఎత్తుకున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నరసాపురం టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి):నరసాపురం పట్టణం, మండలంలో కలెక్టర్ నాగరాణి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వాసుపత్రి వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. డాక్టర్లను మందులపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. అక్కడి నుంచి ఎన్టీఆర్ కాలనీ, రూరల్ పోలీస్ స్టేషన్ వద్దనున్న హాస్టల్ భవనాలను పరిశీలించారు. అన్ని వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. గత ఏడాది పది ఫలితాలపై వార్డెన్లను ఆరా తీశారు. మరుగుదొడ్లు, టాయిలెట్స్‌ను రిపేర్లు చేయించాలని ఆదేశించారు. వసతి గృహాల మరమ్మతులకు రూ.18 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. లేసు పార్కును సందర్శించి అల్లికలతో శిక్షణ పొందుతున్న మహిళతో సమావేశమయ్యారు. ట్రేడ్‌కు అనుగుణంగా ఉత్పత్తులు చేయాలని, కొత్త డిజైన్లను ఎప్పటికప్పుడు శిక్షణ పొందాలన్నారు. ఆర్డీవో దాసి రాజు, పీడీ వేణుగోపాల్, హౌసింగ్ పీడీ పిచ్చయ్య, రామాంజనేయరాజు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ జయలక్ష్మి, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : జేసీ

భీమవరం రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి):వాతావరణ మార్పుల దృష్ట్యా రైతులంతా అప్రమత్తంగా ఉండాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్ నుంచి ధాన్యం కొనుగోలు, సేకరణ, భద్రతపై జిల్లా, డివిజన్, మండల స్థాయి కమిటీలతో గూగుల్ మీట్ ద్వారా మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 6.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామన్నారు. వర్షాభావం కారణంగా ధాన్యాన్ని ఏఎంసీ గోదాముల్లోను, టార్పాలిన్‌లతోనుకప్పి భద్రపరచాలన్నారు. మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. గోనె సంచుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా రైతులకు ఏమైనా సమస్యలు ఎదురైతే టోల్‌ఫ్రీ నెంబర్ 81216 76653కు ఫోన్ చేసి వాటిని పరిష్కరించుకోవాలని కోరారు.



ఆకివీడులో ఉండి నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడులో ఎమ్మెల్సీ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న నియోజకవర్గ నేతలు - వార్త 8లో..

మహా జోష్



ఆచంట మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితరులు -8లో..

జోరుగా.. హుషారుగా

తెలుగుదేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మహానాడును అత్యంత ఘనంగా నిర్వహించే దిశగా పార్టీ అధినాయకత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. దీనిని విజయవంతం చేసేందుకు వివిధ కమిటీలను ఏర్పాటుచేసింది. వీటిల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సీనియర్లకు అవకాశం కల్పించారు. మొత్తం 17కు పైగా కమిటీలను వేయగా, వీటిలో ఏడు కమిటీల్లో మన నేతలున్నారు. మరోవైపు నియోజక వర్గాల వారీగా కార్యకర్తల్లో జోష్ పెంచేందుకు మినీ మహానాడులను ఇప్పటికే నిర్వహిస్తోంది. వీటికి పెద్ద ఎత్తున హాజరుకావడమే కాకుండా పార్టీ తాజా విజయం ప్రస్తావిస్తూ ఉద్రుతలూగుతున్నారు.

టీడీపీలో మహానాడు సందడి

కమిటీల్లో ఉమ్మడి జిల్లా నేతలు.. మంత్రి నిమ్మలతో సహా తొమ్మిది మందికి చోటు

మినీ మహానాడులకు పోటెత్తుతున్న కార్యకర్తలు.. ఆనందంలో ఎమ్మెల్యేలు, కన్వీనర్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి):

తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడప వేదికగా మహానాడు నిర్వహిస్తున్నారు. టీడీపీ తిరిగి అధికార పగ్గాలు చేపట్టిన తొలి ఏడాదిలో జరుగుతున్న మహానాడు కావడంతో ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. మహానాడు విజయవంతానికి 17 కమిటీలను వేయగా, వీటి ఏడింటిలో ఉమ్మడి పశ్చిమ నేతలు, ఎమ్మెల్యేలనే నియమించారు. ఆది నుంచి పార్టీకి కార్యకర్తగా క్రమశిక్షణతో ఎదిగిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆయనను ఆహ్వాన కమిటీలోను, సభా ప్రాంగణం, పర్యవేక్షణ కమిటీల్లో చోటు కల్పించారు. భోజనాల ఏర్పాటు కమిటీలో దెందులూరు, తణుకు ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ఆరిమిల్లి రాధాకృష్ణలకు చోటు కల్పించారు. తీర్మానాల కమిటీలో సీనియర్ నేత ఎంఏ షరీఫ్‌ను, ఫొటోప్రదర్శన కమిటీలో మాజీ మంత్రి పీతల సుజాత, రవాణా కమిటీలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజులకు అవకాశం ఇచ్చారు. పత్రిక, మీడియా కమిటీలో సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథికి, పార్కింగ్ కమిటీలో పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజును నియమించారు. ఇంతకుముందు ఈ కమిటీల్లో ప్రత్యేకంగా సీనియర్లకు అవకాశం కల్పించేవారు. ఈసారి సీనియర్ నేత, మాజీ ఎంపీ మాగంటి బాబు సహా పలువురికి చోటివ్వకపోవడం చర్చనీయాంశమైంది.

నియోజకవర్గాల్లో పసుపు జోష్

మహానాడు వచ్చిందంటే చాలు టీడీపీ శ్రేణుల్లో పట్టరాని ఆనందం కనిపిస్తుంది. ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో పెద్దఎత్తున మినీ మహానాడులు జరుగుతున్నాయి. ఏలూరు, చింతలపూడి, పోలవరం, ఉంగుటూరు, కైకలూరు, భీమవరం, ఉండి, ఆచంట, తాడేపల్లిగూడెం, గోపాలపురం నియోజకవర్గాల్లో పూర్తయ్యాయి. అన్నిచోట్ల మహిళలతోపాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు ఉత్సాహంగా తరలివచ్చారు. గడిచిన ఐదేళ్లపాటు తాము ఎదుర్కొన్న కష్టాల స్థానంలో సంతోషం పెరగడానికి పార్టీ గెలుపే కారణమని అనేకమంది తేల్చి చెబుతున్నారు. కష్టమైనా, నష్టమైనా పార్టీకి వెన్నంటే ఉంటామని శపథం చేస్తున్నారు. గతంలో నిర్దీత సమయంలోనే మినీ మహానాడు నిర్వహించేవారు. కానీ ఈసారి ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తుండగా, పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావడంతో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ కన్వీనర్లు ఉప్పొంగిపోతున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు లేని నియోజక వర్గాల్లోను దీటుగా జరుగుతున్నాయి. ఉంగుటూరు, తాడేపల్లి గూడెం వంటి నియోజకవర్గాల్లో మినీ మహానాడు సూపర్ సక్సెస్ అయ్యింది. మంత్రులు నిమ్మల, పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు, నూజివీ డుల్లో ఇంకా మినీ మహానాడులు నిర్వహించాలి. నేడు దెందులూరు, నరసాపురాల్లో జరగనున్నాయి.



ఏపీఈఏపీ సెట్ ప్రశాంతం

భీమవరం రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 182 విద్యార్థులకు 166 మంది, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 180కి 162, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 206కు 196 మంది హాజరయ్యారు. నరసాపురం స్వర్ణాంధ్రలో 300 కు 281 మంది, విద్యార్థులు పరీక్ష రాశారు. తాడేపల్లిగూడెం వాసవిలో 479 మందికి 429 మంది, శశి ఇంజనీరింగ్ కళాశాలలో 241 మందికి 221 మంది హాజరయ్యారు.

ఎస్ఎస్‌సీ సప్లిమెంటరీ

పదో తరగతి సప్లిమెంటరీలో భాగంగా మంగళవారం హిందీ పరీక్ష జరిగింది. జిల్లాలో 602 మంది విద్యార్థులకు 486 మంది హాజరు కాగా 186 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగలేదని డీఈవో నారాయణ తెలిపారు.

ఐసెట్ ఫలితాలు వెల్లడి

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల ఏడో తేదీన నిర్వహించిన ఐసెట్-2025 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లాకు సంబంధించి విద్యార్థుల్లో 712 మంది పరీక్షలు రాయగా 679 మంది ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థినిలలో 1138 మందికి 1088 మంది ఉత్తీర్ణత సాధించారు.

వెబ్‌సైట్‌లో ఉమ్మడి జిల్లా వైద్య ఉద్యోగార్థుల మెరిట్ జాబితా - 7లో

బదిలీలపై ఉన్న నిషేధాన్ని వచ్చే నెల 2వ తేదీ వరకు సడలించి, పూర్తి చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఇప్పటికే ఎంపీడీవోలు, తహశీల్దార్లు, జిల్లాస్థాయి అధికారులుగా చాలా మంది బాధ్యతలు తీసుకున్నారు. ఉమ్మడి పశ్చిమలో ఇపుడు మండల స్థాయిలో సిబ్బంది అత్యధికంగా బదిలీల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రత్యేకించి మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుల కోసం చాలా మంది ప్రయత్నాలు ప్రారంభించారు. పోలీస్ శాఖలో కిందస్థాయి బదిలీలు దాదాపుగా పూర్తి కావచ్చాయి.



ఐదేళ్లు దాటితే కదలాల్సిందే..!

- ఒకేచోట రెండేళ్లు పనిచేస్తే బదిలీకి అర్హులే..
- ఉద్యోగులు నేటి నుంచి.. 24లోగా దరఖాస్తు చేసుకోవాలి
- సిఫార్సుల కోసం పలు శాఖల్లో పోటీ.. నేతల వద్దకు పలువురు క్యూ

(ఏలూరు/భీమవరం టౌన్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

అన్ని ప్రభుత్వ విభాగాల్లోను ఎవరికి వారు బదిలీల కోసం ప్రయత్నాలు ఆరంభించారు. రెండేళ్ల ఒకేచోట పనిచేసి ఉంటే వారంతా బదిలీకి అర్హులు. ఐదేళ్లపైబడి ఒకే ప్రాంతంలో కొనసాగితే కచ్చితంగా స్థానచలనం కావాల్సిందే. ఇప్పటికే ఎవరిని ఎక్కడ నియమించాలో, మరెవర్ని స్థానచలనం చేయాలో ఒక నిర్ణయానికి వచ్చారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రాతిపదికనే బదిలీ నియామకాలు జరగాలి. చాలా శాఖల్లో ఇప్పటికే సిబ్బంది కొరత ఉండగా, మరికొన్ని శాఖల్లో సర్‌ప్లస్ కనిపిస్తోంది. ఈ రెండింటి మధ్య సమతూకం పాటిస్తే కొంతలో కొంత వివిధ శాఖల్లో ఉన్న భారం తగ్గుముఖం పట్టేది. పట్టణాలకు అత్యంత దగ్గరగా ఉన్న మండలాల్లో స్థానాల కోసం ఇప్పుడు పోటీ పడుతున్నారు. జిల్లా కేంద్రాలైన ఏలూరు, భీమవరం పరిసర మండలాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

రెండు వేల మందికి పైగానే..

ఈసారి బదిలీల్లో ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు వేల మందికిపైగా ఉండవచ్చునని భావిస్తున్నారు. ప్రత్యేకించి సిబ్బంది మాత్రమే అత్యధికంగా బదిలీ కోరుకుంటున్నారు. కొన్నిచోట్ల రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం ఉండటంతో ఆ దిశగా కదులుతున్నారు. ఉపాధ్యాయ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నేటి నుంచి ఆన్‌లైన్‌లో బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని విద్యా శాఖ ప్రకటించింది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీకి ఆమోదం తెలిపారు. తప్పనిసరి బదిలీ అయ్యేవారు, రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకునే వారు ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలి. ఏపీ వైద్య విధాన పరిషత్‌లో బదిలీలకు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వార్డు, సచివాలయ సిబ్బందిని మార్పు, చేర్పులు చేసేందుకు ఇప్పుడు అవకాశం లేదు. పోలీస్ శాఖకు సంబంధించి జిల్లా ఎస్పీలు ఈ మధ్యనే బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు.

మాకు ఓ అవకాశం ఇవ్వండి

కోరుకున్న స్థానానికి బదిలీపై వెళ్లాలనుకునే వారిలో కొందరు సిఫార్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. సాధారణ బదిలీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియకే అగ్ర ప్రాధాన్యత. అయినప్పటికీ ఆయా నియోజకవర్గాల్లో సామాజిక వర్గాల వారీగా కొందరు ఎమ్మెల్యే సిఫార్సుల కోసం ప్రయత్నాలు ఆరంభించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి ఆశీస్సుల కోసం మరికొందరు ప్రయత్నిస్తున్నారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాలకు చేరువగా ఉండాలనే తపనతో వీరంతా తమ ప్రయత్నాలకు మరింత పదునుపెట్టారు.

బదిలీలకు మార్గదర్శకాలు

- ఈనెల 31వ తేదీ నాటికి ఒకేచోట కచ్చితంగా ఐదేళ్ల పూర్తయిన ఉద్యోగిని బదిలీ చేస్తారు.
- సొంత అభ్యర్థనపై బదిలీ కోరుకునే ఉద్యోగులు బదిలీలకు అర్హులు.
- పదవీ విరమణకు దగ్గర ఉన్న వారికి సాధారణంగా బదిలీలు ఉండవు.
- ప్రత్యేక వర్గాలకు ప్రాధాన్యత, కొన్ని ప్రత్యేక పరిస్థితులలో వున్న ఉద్యోగులకు బదిలీలల్లో ప్రాధాన్యత ఉంటుంది.
- దృష్టి లోపం, వినికిడి లోపం, శారీరకంగా చలన పరిమితులున్న ఉద్యోగులకు వారు కోరుకున్నచోటుకు బదిలీల్లో ప్రాధాన్యత ఇస్తారు.
- వైద్య పరమైన కారణాలను పరిగణలోకి తీసుకుంటారు.
- మహిళా ఉద్యోగులకు సాధ్యమైనంత వరకు భర్త పనిచేసే చోటుకు బదిలీ చేస్తారు.
- ఒంటరి మహిళ స్వస్థలానికి కాని, కోరుకొన్న ప్రాంతానికి కాని బదిలీ చేసే అవకాశం ఉంది.
- 40 శాతం అంగవైకల్యం ఉన్న ఉద్యోగులకు వారి సామర్థ్యాన్ని బట్టి బదిలీలు ఉంటాయి.
- వచే నెల రెండో తేదీ నాటికి బదిలీలు పూర్తి చేయాలి. మూడో తేదీ నుంచి తిరిగి బదిలీలపై నిషేధం వుంటుంది.
- స్థాయిని బట్టి బదిలీలకు కౌన్సిలింగ్ తేదీలను ఇస్తారు. ఈ నెల 24లోపు బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాలి. ఆ తర్వాత తర్వాత బదిలీల ప్రక్రియ వేగవంతం అవుతుంది.



ఏలూరులో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ

దూరవిద్య యూజీ, పీజీ కోర్సులతో అన్నివర్గాలకు విస్తృత విద్యా ప్రయోజనాలు

నూజివీడుకు బయోగ్యాస్ ప్లాంట్

రూ.150 కోట్ల పెట్టుబడి.. 500 మందికి ఉపాధి అవకాశాలు

రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో గ్రీన్‌సిగ్నల్.. సర్వత్రా హర్షం



ఉప్పురాశి తడవకుండా కప్పిన కవర్లు

ముంచెత్తిన వాన

ఉప్పు రైతుల ఆశలపై నీళ్లు

నీట మునిగిన ఉప్పు మడులు

ధర బాగున్నా కలిసిరాని కాలం

ఇంకా రైతుల వద్దే ధాన్యం రాశులు

పశ్చిమలో 30 వేల టన్నులు

ఏలూరులో 20 వేల టన్నులు

60 వేల ఎకరాల్లో ఆక్వా క్రాప్ హాలిడే

10న ఆక్వా రైతుల చలో అమరావతి

సంఘ చైర్మన్ గాంధీభగవాన్‌రాజు

6

పాత పద్ధతిలోనే రేషన్

- ఎండీయూ వాహనాలు నిలిపివేత
- ఇకపై డీలర్ల వద్దకు వెళ్లి తీసుకోవాలి
- జూన్ 1 నుంచి అమలు చేసేలా నిర్ణయం

భీమవరం టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి):రేషన్ సరుకులను వచ్చే నెల నుంచి పాత పద్ధతిలోనే కార్డుదారులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ఇంటింటికి రేషన్ పేరిట వాహనాల ద్వారా పంపిణీ చేపట్టడంతో ప్రభుత్వానికి అదనపు భారంగా మారింది. ప్రతీ నెల జిల్లాకు ఐదు లక్షల 52 వేల రేషన్ కార్డుల ద్వారా వాహనాల ద్వారా రేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వానికి రూ.63 లక్షల 36 వేలు భారం పడేది. తాజా నిర్ణయంతో ఈ భారం తగ్గనుంది. జిల్లాలోని 20 మండలాల్లో 1052 షాపులకు 356 మొబైల్ డెలివరీ యూనిట్స్ (ఎండీయూ) వాహనాలతో ఇంటింటికి సరుకును అందించేవారు. కార్డుదారులు ప్రతీ నెల ఒకటి నుంచి ఐదో తేదీలోపు ఎప్పుడు వచ్చి సరుకులు ఇస్తారా అనే వేచి చూడాల్సిన పరిస్థితి. తేదీ తప్పిందా ఇక ఆ నెల రేషన్ ఆగినట్లే ! దీంతో కార్డులు వాహనం కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. దీనిపై ప్రజల్లో అసంతృప్తి ఏర్పడింది. మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం ఇంటింటికీ రేషన్ సరఫరా చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మిగిలిన వారంతా రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి. గత ప్రభుత్వం వాహనదారుడికి నెలకు రూ.18 వేలు అందించేవారు. ఇందులో రూ.3 వేలు వాహనం ఈఎంఐ కింద జమ చేసుకునేవారు. డీజిల్‌కు రెండు వేలు ఖర్చయ్యేది. మిగిలిన రూ.13 వేలతోనే వాహనం రిపేర్లు, సహాయకునికి జీతం చెల్లించి మిగిలిన మొత్తంతో కుటుంబం గడవాల్సిన పరిస్థితి. దీనిపై జగన్ ప్రభుత్వ హయాంలో వారు ఆందోళన చేసినా పట్టించుకోలేదు. ఇప్పుడు ఆ వాహనాలను వారికే ఇచ్చేస్తారని సమాచారం.

ములపర్రు సొసైటీ మాజీ అధ్యక్ష, కార్యదర్శుల అరెస్ట్
రెండు కోట్ల కుంభకోణంపై సీఐడీ విచారణ 7

నరసాపురం సెంట్రల్ బ్యాంక్ స్కామ్ నిందితుడిపై ఫిర్యాదు.. కేసు నమోదు

అదుపు తప్పిన వాహనాలు
వేర్వేరు చోట్ల 28 మంది కూలీలకు గాయాలు 7

జగన్‌కు నా పేరెత్తే అర్హత లేదు
మంత్రి డాక్టర్ నిమ్మల



కాల్వ పనులు ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

నూజివీడుకు బయోగ్యాస్ ప్లాంట్

నూజివీడు, మే 20 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గానికి పరిశ్రమలు సాధించి, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తానని నూజివీడు శాసనసభ్యుడు కొలుసు పార్థసారథి ఇచ్చిన హామీ కార్యరూపం దాలుస్తోంది. రాష్ట్రమంత్రివర్గం నేడు తీసుకున్న నిర్ణయాల్లో ఏలూరుజిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లి వద్ద నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ కంపెనీవారు 20 టీపీడీ కంప్రెస్‌డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయటానికి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇంధనశాఖ ఈ ప్రతిపాదనను ఆమోదిస్తూ రాష్ట్రమంత్రి మండలి ఆమోదం కోసం పంపింది. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదన ఆమోదిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్ట్‌ను రూ.150 కోట్ల పెట్టుబడితో పెట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కానుంది. దీని ద్వారా నూజివీడు నియోజకవర్గం పారిశ్రామికంగా ఒక అడుగు ముందుకు వేసిన ట్లేనని భావి స్తున్నారు. కంప్రెస్‌డ్ బయోగ్యాస్ అనేది పర్యావరణ అనుకూల మైన పునరుత్పాదక ఇంధనం. ఇది సేంద్రియ వ్యర్థాల నుంచి ఉత్పత్తి అవుతుంది. ఆటోమోటివ్, పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాల్లో సీబీజీ ఉత్పత్తి చేయబడిన బయోగ్యాస్‌ను శుద్ధిచేసి హైడ్రోజన్ సల్ఫైడ్, కార్బన్‌డైఆక్సైడ్, నీటిఆవిరిని తొలగించటం ద్వారా చేయబడుతుంది. శుద్ధిచేసిన ఈ బయోగ్యాస్‌లో 90 శాతం కంటే ఎక్కువ మిథేన్ ఉంటుంది. సీబీజీ ఉత్పత్తి, వ్యవసాయ వ్యర్థాలు, మున్సిపల్ వ్యర్థాలు, ఆహార వ్యర్థాల ద్వారా ఇది ఉత్పత్తి జరుగు తుంది. ఇది సీఎన్‌జీకి ఒక ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగపడు తుంది. అంతేకాదు సీబీజీ గృహాల కోసం కూడా ఉపయోగించవచ్చు. విద్యుత్ ఉత్పత్తికి కూడా ఇది ఉపయోగపడుతుంది.



బయోగ్యాస్ ప్లాంట్ నమూనా

ఏలూరులో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ !

మంత్రివర్గ సమావేశంలో గ్రీన్‌సిగ్నల్
దూరవిద్య యూజీ, పీజీ కోర్సులతో
అన్నివర్గాలకు విస్తృత విద్యాప్రయోజనాలు

ఏలూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఉన్నతవిద్యలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరున్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏలూరులో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి రాష్ట్రం విభజన కాలపరిమితి గతేడాది ముగియడంతో ఏడాది కాలంగా (2023-24) నిలిచిపోయిన యూనివర్సిటీ ప్రవేశాలను, కార్య కలాపాలను ఇకమీదట ఆంధ్రప్రదేశ్ నుంచే ఏలూరు ప్రధానకేంద్రంగా మళ్లీ ప్రారంభించ డానికి మార్గం సుగమమైంది. గతేడాదివరకు ఉమ్మడి రాష్ట్రానికి సంబంధించి హైదరాబాద్ కేంద్రంగా విశ్వవిద్యాలయం కార్యకలాపాలు జరిగాయి. రాష్ట్ర విభజన అనంతరం పదేళ్ల కాలపరిమితి గతేడాది ముగి యడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం అడ్మిషన్లను నిలిపివేసింది. దీంతో రాష్ట్ర విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రాష్ట్రానికి సంబంధించి అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ప్రధాన కేంద్రాన్ని ఏలూరులోనే నెలకొల్పడం ద్వారా దూరవిద్యా విధానంలో యూజీ, పీజీ కోర్సులు చేయాలనుకునే అభ్యర్థులకు విస్తృత విద్యాప్రయోజనాలతో వెసులుబాటు కల్పించింది.

ఏలూరులో యూనివర్సిటీ ఎక్కడ..?

1984లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ సెంటర్‌ను ఏలూరు సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల ప్రాంగణంలోని ఓ భవనంలో ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీకి వున్న 70 స్టడీసెంటర్లలో ఏటా కొత్తగా 30 వేల అడ్మిషన్లు జరుగుతుండగా, ఆయా కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు, బ్యాక్‌లాగ్ విద్యార్థులు కలిపి మొత్తంమీద ఒక లక్షమంది ఉంటారని అంచనా. జిల్లాకు సంబంధించి ఏలూరు, భీమవరం, తణుకు, నల్లజర్ల, చింతలపూడిలలో స్టడీ సెంటర్లు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఏలూరులో కొత్తగా ఏర్పాటవుతోన్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎక్కడ ఉంటుందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. యూనివర్సిటీకి కొత్తగా భవనాలు నిర్మించడానికి అవసరమైన భూముల గుర్తింపు, సేకరణ, నిధుల విడుదల, తదితర మౌలిక వనరులు కల్పించేలోగా కొంతకాలం పాటు అందుబాటులో వున్న భవనాల్లో కార్యకలాపాలను ప్రారంభించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ప్రతిష్టాత్మక ఏపీ నిట్ తొలుత ఏలూరుకు మంజూరు కాగా, నగర శివార్లలోని వట్లూరు చెరువు భూములను నిట్ భవన నిర్మాణాల కోసం కేటాయిం చడం, ఆ మేరకు నిర్మాణాలు పూర్తయ్యేలోగా స్థానికంగా అన్ని వసతులున్న సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల భవనాల్లో తరగతు లను ప్రారం భించడానికి అప్పట్లో సన్నాహాలు జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలోనే తాజాగా ఏలూ రుకు మంజూరైన అంబేడ్కర్ విశ్వ విద్యాలయానికి నూతన భవనాల నిర్మాణం జరిగేలోగా యూనివర్సిటీ అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ కార్యకలా పాలను స్థానికంగా అన్ని సౌకర్యాలున్న ఏదైనా విద్యా సంస్థకు చెందిన భవనాల్లో తాత్కాలిక ప్రాతిపదికన ప్రారంభించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. సాధార ణంగా ఏటా జూన్ నుంచి మరుసటేడాది ఏప్రిల్ వరకు అంబేడ్కర్ యూనివర్సిటీ ఆఫర్ చేసే కోర్సులకు విద్యా సంవత్సరంగా ఉంటోంది. సెమిస్టర్ల పద్ధతిన జరిగే వార్షిక పరీక్షలు ఏటా నవంబర్ /డిసెంబరు, ఏప్రిల్/మే నెలల్లో నిర్వహి స్తారు. ఇప్పటికే ఒక ఏడాది అడ్మిషన్లు నిలిచిపోయిన నేపథ్యంలో జూన్ నుంచి ప్రారంభమయ్యే నూతన విద్యాసంవత్సరంలోనే యూని వర్సిటీ అకడమిక్ కార్యకలాపాలను పునరుద్ధరిస్తారని భావిస్తున్నారు. కొత్తగా ఏర్పాటవుతోన్న అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కోసం ఒక ఉపకులపతి, రిజిస్ట్రార్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, బోధనకు ఫ్యాకల్టీ, పరిపాలనా విభాగం, బోధనేతర సిబ్బంది నియా మకాలు జరగాల్సి ఉంది. ఏలూరు కేంద్రంగా ఏర్పాటవుతోన్న యూనివర్సిటీ స్థాపన ప్రాంతం, ఈలోగా కార్య కలాపాలను ఎక్కడ నిర్వహి స్తారన్న విషయంపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

అతి తక్కువ ఫీజులతో ఉన్నత విద్యావకాశాలు

1982లో స్థాపించిన అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సి టీలో దూరవిద్యా విధానంలో వివిధ డిగ్రీ, పీజీ, డిప్లొమా, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు, మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటు, ఏ యూని వర్సిటీలోను లేనివిధంగా బీఈడీ కోర్సును దూరవిద్యా విధానంలో చదివేందుకు అవకాశం ఉంది. జాతీయ స్థాయి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డెక్) అనుమతి ఉండటంతో యూనివర్సిటీ జారీచేసే సర్టిఫికెట్లతో ప్రభుత్వోద్యోగాలు కూడా పొందవచ్చు. ముఖ్యంగా ఇంటర్ ఉత్తీర్ణతతో ప్రభుత్వోద్యోగాలు చేస్తున్నవారు పదోన్న తులు పొంద డానికి అవసరమైన డిగ్రీ, పీజీ కోర్సులను అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పూర్తిచేయడానికి అనువుగా ఉంటోంది. గృహిణులు, వ్యాపారులు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు, పేదవర్గాలకు చెందినవారికి తక్కువ ఫీజుల్లోనే ఉన్నతవిద్యను అభ్యసించ డానికి యూనివర్సిటీ ప్రత్యేకతగా చెప్పవచ్చు. రెగ్యులర్ తరగతులకు అవసరమైన హాజరుతో నిమిత్తం లేకుండా వారాంతపు రోజులు, పండుగల్లో కాంటాక్టు క్లాసులను నిర్వహిస్తుండటం వల్ల అడ్మిషన్లు తీసుకున్నవారికి అనువుగా ఉంటోంది. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తిచేయడానికి సుమారు రూ.3,200, పీజీ విద్యకు సుమారు రూ.5 వేలు కోర్సు మెటీరియల్‌తో సహా ఏడాది కాలానికి ఉంటోంది. ఈ వెసులుబాటును ఉపయోగించుకుని యూనివర్సిటీలో చదివిన పలువురు అభ్యర్థులు ఐఏఎస్, తదితర ఆలిండియా సర్వీసులు కూడా చదివిన వారుండటం గమనార్హం.



ఏలూరులోని అంబేడ్కర్ స్టడీ సెంటర్



బంగారు మిశ్రమంను సీల్ వేస్తున్న జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు... బంగారు వస్తువుల వివరాలను బ్యాంకు అధికారులకు అందిస్తున్న ఈవో మూర్తి

హుండీల ద్వారా శ్రీవారికి 4.940 కేజీల బంగారం

ఎస్‌బీఐలో డిపాజిట్ చేసిన ఆలయ అధికారులు

ద్వారకాతిరుమల, మే 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారికి హుండీల ద్వారా లభించి, ఆలయ స్ట్రాంగ్ రూములో గతేడాది కాలంగా భద్రపరి చిన ఆలయ, ఉప, దత్తత దేవాలయాలకు సంబందించిన బంగారు మిశ్రమాన్ని మంగళ వారం విజయవాడ, భారతీయ స్టేట్‌బ్యాంకుకు అప్పగించారు. గోల్డ్‌బాండ్ స్కీమ్ ద్వారా 4.940 కేజీల బంగారాన్ని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి, డిప్యూటీ కమిషనర్ బాబూరావు, జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు, అర్చకుడు కొండూరి జనార్దనా చార్యులు సమక్షంలో బ్యాంకు అధికారులకు అప్పగించారు. ఆలయ ఏఈవోలు శ్రీనివాస్, నటరాజారావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పెదమల్లం మాచేనమ్మ జాతర

ఆచంట, మే 20 (ఆంధ్రజ్యోతి): పెదమల్లం మాచేనమ్మ, పల్లాలమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారి ఊయల సేవ కార్య క్రమం నిర్వహించారు. భక్తులు నిప్పుల గుండాలు తొక్కారు. సోమవారం రాత్రి అమ్మవారి పెద్ద జాతర కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నిప్పులగుండం తొక్కుతున్న భక్తులు

60 వేల ఎకరాల్లో ఆక్వా క్రాప్ హాలిడేకు సిద్ధం

జూన్ 10న ఆక్వారైతుల చలో అమరావతి
ఆక్వా సంఘ చైర్మన్ గాంధీభగవాన్‌రాజు

పాలకొల్లు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : గత నెల 7న జరిగిన ఆక్వారైతుల సమా వేశంలో రైతులందరూ ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం ప్రకారం పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లోని సుమారు 60 వేల ఎకరాల్లో ఆక్వా క్రాప్ హాలిడే పాటిస్తున్నామనీ, ఇప్పటికే 20 వేల ఎకరాల్లో రైతులు హాలిడే పాటించారని పాలకొల్లు జైభారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అన్నారు. పాలకొల్లులో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జూలై,ఆగష్టు, సెప్టెం బరు మూడు నెలలు పాటు క్రాప్ హాలిడేను పాటించి, అక్టోబరు 1నుంచి తిరిగి మొదలు పెడతామన్నారు. రొయ్యపిల్లలు విక్ర యించే హేచరీలు నుంచి, మేత కంపెనీలు, కొనుగోలు దారుల వరకూ అందరూ సిండికేట్ అయ్యి ఆక్వారైతులను నిలువునా దోపిడీ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా పరిశ్రమలపై ట్రంపు విధించిన సుంకాన్ని అస్త్రంగా తీసుకొని కొను గోలు కేంద్రాలు ఇప్పటికీ రైతులు నుంచి రొయ్యలను అడ్డగోలుగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఆక్వా సమస్యలపై జూన్ 10న చలో అమరావతి చేపడుతున్నామని ఆక్వా రైతులు, కార్మికులు తరలివెళ్లి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి అచ్చెన్నాయు డుకి ఆక్వా సమస్యలను వివరిస్తామన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాంధీ భగవాన్‌రాజు

ఏలూరులో ముగిసిన జాతీయస్థాయి నాటిక పోటీలు

ఏలూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు జరిగిన ఆలపాటి రామచంద్ర రావు జాతీయస్థాయి తెలుగు నాటిక పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. వైఎంహెచ్ఏ, హేలాపురి కళాపరిషత్తు సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న నాటిక పోటీల్లో భాగంగా మంగళవారం ప్రదర్శించిన నాటికలు ఆలోచనాత్మకంగా సాగాయి. ఆధు నిక ఆడపిల్లల స్వతంత్ర భావనలు, ఆడ పిల్లలు భారం అన్నట్లుగా నమ్మే వక్ర భావజా లాన్ని సూటిగా విమర్శించిన రుతువు లేని కాలం, ఓ సామాన్య మహిళ రైల్వే శాఖపై సంధించిన అస్త్రంగా సాగిన జనరల్ బోగీలు నాటికలు ఆలోచింపచేశాయి. పోటీలను తిల కించేందుకు వచ్చిన ప్రేక్షకులతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కన్న కొడుకు ఆచూకీ తెలి యక ఓ తల్లి చెందే ఆవేదన పోరాటమే జన రల్ బోగీలు. రైలు ప్రమాదాలలో జనరల్ బోగీలలో ప్రయాణించే ప్రయాణికులు మర ణించిన సందర్భాలలో వారి చిరునామాలు రైల్వేశాఖ వద్ద ఉండని విషయం కూడా అందరికీ తెలిసిందే. అలాంటి ప్రమాదంలో త న కొడుకును దూరం చేసుకున్న ఓ తల్లి సావి త్రమ్మ రైల్వేశాఖతో పాటు ప్రజా ప్రతినిధు లకు ఉత్తరాల ఉద్యమం ప్రారంభించి సమ స్యకు ఎలాంటి పరిష్కారం చూపిందన్న ఇతి వృత్తంతో సాగిన నాటిక శ్రీ సాయి ఆర్ట్స్ కొలక లూరు వారు ప్రదర్శించిన జనరల్ బోగీలు పీటీ మాధవ్ రచించగా గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. నాటికలో సావిత్రమ్మ పాత్రధారిగా నటించిన సీనియర్ సురభి ప్రభావతి తన నటనా కౌశలంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కుటుంబ బంధాన్ని తెలియజె ప్పిన రుతువు లేని కాలం వర్తమానంలో ఆడపిల్లలు భర్త కావాలి అత్త నికి తల్లితం డ్రులు, తోబుట్టువులు ఉండకూడదు అలాంటి వ్యక్తి దొరికే వరకు పెళ్ళి కూడా చేసుకోవడం లేదు. కుటుంబ బంధాలు తెలియజెప్పిన రుతువు లేని కాలం నాటిక కళానికేతన్ వీరన్న పాలెం వారు ప్రదర్శించిన ఈ నాటిక శ్రీఅగస్త్య రచించగా వైబి చౌదరి దర్శకత్వం వహించారు. సినీ నిర్మాత అంబికా కృష్ణ, వైఎంహెచ్ఏ ప్రతి నిధులు కేవీ సత్యనారాయణ, మజ్జి కాంతా రావు, సోమలింగేశ్వరరావు, తదితరులు పర్య వేక్షించారు.



జనరల్ బోగి నాటకంలో సన్నివేశం

ఉప్పు రైతుల ఆశలపై నీళ్లు

సీజన్‌లో వరుస వానలు
నీట మునిగిన ఉప్పు మడులు
ధర బాగున్నా కలిసిరాని కాలం



ఉప్పురాశులు తడవకుండా కప్పిన బరకాలు

నరసాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉప్పు రైతుల ఆశలపై అకాల వర్షాలు నీళ్లు చల్లాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నరసాపురం, మొగల్తూరు మండలాల్లో వందలాది ఎకరాల పంట నీట మునిగింది. సీజన్‌లో వర్షాలు కురవడంతో చేతికొచ్చిన పంట నీటిపాలైంది. దీంతో రైతులు నష్టాలను మూటగట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఈ ఏడాది తీరంలో ఉప్పు విస్తీర్ణం తగ్గింది. నరసాపురం మండలంలోని బియ్యపుతిప్ప, చినలంక, పీఎం లంక, మొగల్తూరు మండలంలోని కేపిపాలెం, మోళ్ళపర్రు ప్రాంతాల్లో కేవలం 1500 ఎకరాల్లో మాత్రమే ఉప్పు సాగు చేస్తున్నారు. సీజన్ ఆరంభంలో ప్రకృతి అనుకూలంగా ఉండటంతో రైతులు దిగుబడిపై కోటి ఆశలు పెట్టుకున్నారు. అయితే ఎండలు ఎక్కువగా ఉండే మే నెలలోనే అకాల వర్షాలు కురవడంతో రైతులు నిండా మునిగారు. చదును చేసిన రాశులన్నీ నీటి మునిగాయి. దీంతో మళ్లీ పెట్టుబడులు పెట్టి సాగు చేయాలంటే ప్రకృతి అనుకూలిస్తుందా ? లేదా అన్న భయం రైతాంగంలో నెలకొంది. ఎకరాకు రూ.50 నుంచి రూ.60 వేలు పెట్టుబడులు అవుతాయి. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు అధికంగా ఉండటంతో దిగుబడి కూడా ఎక్కువగా వస్తుంది. అయితే ఈసారి మే నెలలోనే వరుస వర్షాలు కురిశాయి. ఇప్పటికే రెండు సార్లు వానలు పడ్డాయి. జూన్ వరకు వాతావరణం అనుకూలంగా ఉంటుందని , రెండు సార్లు వర్షాలు పడినప్పుడల్లా మడులకు పెట్టుబడులు పెడుతూ వచ్చారు. అయితే రెండు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో పూర్తిగా నీట మునిగాయి. దీంతో రైతులు గట్లుపై ఉంచిన ఉప్పురాశుల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకుంటున్నారు. కొందరు ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉప్పు కరగకుండా రక్షించుకునే ప్రయత్నం చేశారు. ఎండలు ఎక్కువగా ఉండే మే నెలలోనే వర్షాలు కురవడంతో పెట్టిన పెట్టుబడులు దక్కలేదని రైతులు వాపోతున్నారు.



నీట మునిగిన ఉప్పు మడులు

- **సీజన్ కలిసి రాలేదు**

ఈసారి ప్రకృతి అనుకూలించలేదు. గతంలో ధర ఉండేది కాదు. ప్రస్తుతం కేజీ రూ.6 నుంచి రూ.9 వరకు ఉంది. పంట దిగుబడి బాగా వస్తే లాభదాయకంగా ఉంటుందని, అప్పులు తెచ్చి మరీ సాగు చేశాం. అయితే ఈసారి మే నెలలోనే వర్షాలు పడ్డాయి. ఇప్పటికే రెండు సార్లు పెట్టుబడులు పెట్టాం. ఇక అప్పులు తెచ్చి సాగు చేయలేం.

- శివ, ఉప్పు రైతు, పీఎం లంక

ధాన్యం ఇంకా ఉంది..

లక్ష్యానికి చేరువుగా సేకరణ
ఏలూరు జిల్లాలో కొనుగోలు లక్ష్యం 2.70 లక్షల టన్నులు
ఇప్పటికే 2.50 లక్షల టన్నులు కొనుగోలు

ఏలూరు సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలులో తొలుత లక్ష్యం తక్కువగా నిర్దేశించడంతో రైతులు తమ ధాన్యం ఎవరు కొంటారని ఆందోళన చెందారు. ఈ విషయంపై కొనుగోళ్ల లక్ష్యం పెంచాలని రైతులు డిమాండ్‌పై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురి తమైంది. జిల్లా వ్యాప్తంగా రైతుల వద్ద ధాన్యం మిగిలి ఉన్నదని జేసీ ధాత్రిరెడ్డి పర్యటనలో తేలింది. దీనిపై ప్రభుత్వానికి ప్రతి పాదనలను పంపగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు సంబంధించి తొలుత నిర్దేశించిన లక్ష్యం 2.20 లక్షల మెట్రిక్ టన్నులను 2.70 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచింది. ఈక్రమంలో ఇప్పటికే జిల్లాలో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరంగా కొనసాగు తోంది. రాష్ట్ర ప్రభుత్వం అవసరానికి అనుగుణంగా నాణ్యమైన గోనెసంచులు సమకూర్చడంతో పాటు 24 గంటల లోపు చెల్లింపులతో మద్దతు ధర లభించడంతో అన్నదాతల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఉన్న రైతు సేవాకేంద్రాల ద్వారా 62,50,968 గోనె సంచులను రబీ ధాన్యం కొనుగోలుకు అందుబాటులో ఉంచారు. లక్ష్య సేకరణలో మిగిలిన 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సరిపడా గోనె సంచులు రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 20,225 మంది రైతుల నుంచి రూ. 575 కోట్లు విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా రూ. 485.82 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేసేం దుకు జిల్లాస్థాయిలో 08812-230448, 77020 03584, 75695 62076 నంబర్లతో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

పశ్చిమలో 30 వేల టన్నులు రైతుల వద్దే..

భీమవరం రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఈ దాళ్వా పంట మాసూళ్ళలో అకాల వర్షాలు పలుమార్లు ఆటంకాలు కలిగించినా పంట దాదాపు గట్టెక్కేసింది. అయినప్పటికీ ఇంకా కొంత ధాన్యం రైతుల వద్దే ఉండిపోయింది. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ధాన్యం అమ్మకాలకు వీలు లేకుండాపోయింది. పంట కోతలు పూర్తిగా అయినందున వర్షాల ప్రభావం పెద్దగా రైతన్న లపై లేదు. పశ్చిమ గోదావరి జిల్లాలో 30 వేల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ దాళ్వా పంటలో ఇప్పటి వరకు 6.96 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మిగిలిన 30 వేల టన్నుల ధాన్యానికి సంచులు అందుబాటులో ఉంచారు. వర్షాలు నిలిచాక అమ్మకం చేయాలని, అప్పటి వరకు ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ వెంకటేశ్వర్లు తెలిపారు.





ఆకివీడు సాలిపేటలో సీసీ రోడ్‌పై నిలిచిన వర్షపు నీరు.. ఉండిలో జోరుగా కురుస్తున్న వాన

ముంచెత్తిన వాన

కలిదిండి మండలంలో అత్యధికంగా 81.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

ఏలూరుసిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): బంగా ళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవ ర్తనంతో జిల్లాలో పలుప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కలిదిండి మండలంలో 81.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 16 మి.మీ నమోదైంది. ఏలూరు జిల్లాలోని 13 మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఈదురు గాలులు, పిడు గులతో కూడిన వర్షాలు కురవడంతో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ప్రధాన పట్టణాల్లో జనజీవనం స్థంభించింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరో మూడురోజుల పాటు జిల్లాలో భారీగానే వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

వర్షపాతం ఇలా :

ముదినేపల్లిలో 80.4 మి.మీ, మండవల్లిలో 72.4, కైకలూరులో 51.6, పెదవేగిలో 28.2, ఏలూరు అర్బన్ 20.6, పెదపాడు 18.8, ఏలూరు రూరల్ 18.4, భీమడోలు 15.8, దెందు లూరు 14.4, ముసునూరులో 14.2, నూజివీడు 9.8, ఉంగుటూరు 9.6, ఆగిరిపల్లి 5.8, నిడమర్రు 4.4, కామవరపుకోట 1.4, కుక్కు నూ రులో 1 మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి
మంత్రి పార్థసారథి

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఏలూరు జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వ్యవసాయ, పశుసంవ ర్థక, విద్యుత్, రహదారులు, భవనాలు శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వాతావరణ కేంద్రం హెచ్చరికలను అనుగు ణంగా చర్యలు తీసుకోవాలన్నారు.

కాళ్ళలో అత్యధికంగా 42.2 మి.మీ

భీమవరం టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం ఉదయం జిల్లా అంతటా వర్షాలు కురిశాయి. పలు చోట్ల భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫ రాకు అంతరాయం ఏర్పడింది. కాళ్ళలో 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా పెంట పాడులో 14.6 మి.మీ తణుకు 15.2, అత్తిలి 27.8, గణపవరం 10.4, ఆకివీడు 19.8, ఉండి 21.2, పాలకోడేరు 30.4, పెనుమంట్ర 10.4, ఇరగవరం 10,పెనుగొండ 10.8, ఆచంట 20.2, పోడూరు 33.2, వీరవాసరం 35, భీమవరం 29.6, మొగల్తూరు 25.6, నరసాపురం 23.6, పాలకొల్లు 30.2, యలమంచిలి 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఏలూరు మీదుగా వెళ్లే ఆరు రైళ్లు రద్దు

ఏలూరు క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు మీదుగా నడుస్తున్న ఆరు రైళ్ళను వివిధ కారణాల వల్ల రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రైల్ నెంబర్ 22849 షాలిమర్ నుంచి బయలుదేరి సికింద్రాబాద్ వెళ్ళే రైలు ఈనెల 21వ తేదీన రద్దు చేశారు. సత్రగంజి నుంచి ఈనెల 22న బయలుదేరి యశ్వంతపూర్ వెళ్ళే రైలు (02863) రద్దు చేశారు. హౌరా నుంచి ఈనెల 23వ తేదీన బయలుదేరి మైసూర్ వెళ్ళే రైలు(22817) రద్దు చేశారు. ఈనెల 23వ తేదీన సికింద్రా బాద్ నుంచి బయలుదేరి షాలిమార్‌కు వెళ్ళే రైలు (22850), యశ్వం త్‌పూర్ నుంచి ఈనెల 24న బయలుదేరి సత్రగంజి వెళ్ళే రైలు (02864),మైసూర్ నుంచి ఈనెల 25వ తేదీన బయలుదేరి హౌరా వెళ్లే రైళ్లను (22818) రద్దు చేశారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా జవహర్.. అధికారిక ఉత్తర్వులు

ఏలూరు, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా కేఎస్ జవహర్‌ను రెండేళ్ల కాలానికి నియమిస్తూ సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ సెక్రటరీ ఎంఎం నాయక్ అధికారిక ఉత్తర్వులు మంగళ వారం జారీ చేశారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, ఎక్సైజ్‌శాఖ మంత్రిగా కేఎస్ జవహర్ గతంలో పనిచేశారు. పార్టీకి వెన్నంటే ఉండి పలు ఆందోళనల్లో జవహర్ కీలక పాత్ర పోషించారు.



కొవ్వలిలో డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న సెర్ప్ సీఈవో కరుణ

డ్వాక్రా మహిళల అవసరాలను గుర్తించి రుణాలు

» సెర్ప్ రాష్ట్ర సీఈవో కరుణ

దెందులూరు/పెదపాడు, మే20(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు ఆర్థికంగా చేయూత నందించేందుకు వారి అవసరాలను గుర్తించి రుణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు వెళ్తుందని రాష్ట్ర వెలుగు(సెర్ప్) సీఈవో వాకాటి కరుణ అన్నారు. మంగళవారం దెందులూరు మండలం కొవ్వలిలో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, వెలుగు ఏపీఎం పులి సురేష్‌తో కలిసి డ్వాక్రా సంఘాలతో ఆమె సమావేశం నిర్వహించారు. అనంతరం దెందులూరులోని సెర్ప్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. డ్వాక్రా మహిళలు స్వయంగా చిన్నచిన్న వ్యాపారాలు పెట్టుకుని అభివృద్ధి చెందేందుకు షాపులు, దుకాణాలను ఏర్పాటు చేసుకుంటే వారి యూనిట్‌కు అవసరమైన రుణాలు అందించాలని సెర్ప్ అధికారులకు సూచించారు. దెందులూరు ఎంపీడీవో శ్రీదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, మోతుకూరి నాని, గారపాటి కొండయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రూ. 2,182.16 కోట్ల రుణాలు లక్ష్యం

ఏలూరు జిల్లాలో డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,182.16 కోట్ల రుణ ప్రణాళిక లక్ష్యంగా నిర్దేశించామని సెర్ప్ సీఈవో కరుణ తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులోని టెక్నికల్ ట్రైనింగ్ అభివృద్ధి సెంటర్‌లో డీఆర్డీఏ అధికారులు, సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమక్షంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.



తాడేపల్లిగూడెం సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

'రాష్ట్రంలో విదేశీ పంటల సాగుపై దృష్టి సారిద్దాం'

తాడేపల్లిగూడెం రూరల్, మే20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విదేశీ పంటల సాగు ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు శాస్త్రవేత్తలు సూచించారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలో నిర్వహించిన ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ సూచనల మేరకు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు ఆన్‌లైన్‌లో రైతులకు వివరించారు. విదేశీ పంటల సాగుపై రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలు శాస్త్రవేత్తలు అందిస్తారన్నారు. ప్రాంతీయ సహాయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ డి.వెంకటస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని కోత అనంతరం పండ్ల తోటల్లో నష్టం అంచనా వేయడం, నివారణ చర్యలు చేపట్టడం తదితర అంశాలపై వివరించారు. ఏపీఎం పీడీ వీవీ రమణ, హార్టికల్చర్ డీడీ జమదగ్ని, పరిశోధనా సంచాలకుడు డాక్టర్ కేటి వెంకటరమణ, యూనివర్సిటీ డీఐపీ డాక్టర్ కె.ధనుంజయరావు, విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు, కోస్టల్ జోన్-1 డీడీ డాక్టర్ డి.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో జేసీకి వినతి పత్రం అందిస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమ్మె సక్సెస్

భీమవరంటౌన్/ఏలూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఉమ్మడి పశ్చిమ జిల్లాలో చేపట్టిన ఒకరోజు సమ్మె విజయవంతమైంది. ఈ సందర్భంగా వాహన డ్రైవర్లు మాట్లాడుతూ ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల చేయాలని, కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏలూరులో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్వీడీ ప్రసాద్ మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుబ్బారావు, పోసిబాబు, వెంకటేశ్, శామ్యూల్, ప్రేమకుమార్, సాయి, నరేశ్, వంశీ పాల్గొన్నారు. భీమవరంలో వాహన డ్రైవర్ల సమ్మె అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.రాహుల్ కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. సుమారు 12పైగా సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు.

ములపర్రు సొసైటీ మాజీ అధ్యక్ష కార్యదర్శులు అరెస్ట్

» రూ.2 కోట్లపైనే గోల్‌మాల్ : సీఐడీ అధికారుల విచారణ

పెనుగొండ, మే20 (ఆంధ్రజ్యోతి): ములపర్రు హిందూ ముస్లిం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 2018వ సంవత్సరంలోని డిపాజిట్ల గల్లంతు కావడంతో మరోసారి మంగళవారం కలకలం రేగింది. అనాటి అధ్యక్ష, కార్యదర్శులను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 2017లో పాలకవర్గ అధ్యక్షుడు నాగేశ్వరరావు, అనాటి కార్యదర్శి వెంకటేశ్వరరావు నిధులు గోల్‌మాల్‌కు పాల్పడ్డారంటూ డైరెక్టర్లే ఆనాడు రోడ్డు ఎక్కారు. డిపాజిట్‌దారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి డిపాజిట్‌లు చెల్లించాలంటూ ప్రదక్షిణలు చేశారు. అప్పట్లోనే విచారణ జరిపి ఎంత మోసం జరిగిందో బయట పెట్టకుండా కాలం వెళ్లబుచ్చారు. రూ.50 లక్షల నుంచి రూ.రెండు కోట్లు అంటూ రకరకాలుగా ప్రకటించేవారు. చివరకు డిపాజిట్‌దారుల ఒత్తిడి పెరగడంతో అప్పటి కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆత్మహత్యాయత్నం చేశారు. అయితే స్థానికంగా ఉన్న పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకుని నగదు చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చినా అమలుకు మాత్రం నోచుకోలేదు. ఒక డిపాజిటట్‌దారుడు హైకోర్టును ఆశ్రయించడంతో విచారణ జరిపి తేల్చాలంటూ సీఐడీ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో విచారణ చేపట్టారు. విచారణలో రూ.రెండు కోట్లకు పైగా దుర్వినియోగం జరిగిందని విచారణలో తేలింది. మంగళవారం మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మాజీ కార్యదర్శి వెంకటేశ్వరరావులను తణుకులో సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో మరోసారి ములపర్రు సొసైటీ డిపాజిట్లు దుర్వినియోగం కేసు కలకలం రేపింది.

సెంట్రల్ బ్యాంక్ స్కామ్ నిందితుడిపై కేసు

నరసాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పట్టణంలోని సెంట్రల్ బ్యాంకులో ఈనెల 6న వెలుగు చూసిన నకిలీ లీజు అగ్రిమెంట్ స్కామ్‌లో మంగళవారం కొత్త మలుపు తిరిగింది. బాధిత రైతు తిరుమాని నాగరాజు మంగళవారం రాత్రి నరసాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశాడు. పట్టణానికి చెందిన కూనపరెడ్డి ప్రసాద్ మండలంలోని వేములదీవి గ్రామంలో తమ కుటుంబ సభ్యులు పేరున ఉన్న 12 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నట్టు ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి రూ.2.20 కోట్లు నరసాపురం సెంట్రల్ బ్యాంక్‌లో రుణం తీసుకున్నారంటూ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జయలక్ష్మి తెలిపారు. గత నెల 6న బాధిత రైతు తిరుమాని నాగరాజు ఆయన సోదరుడు తిరుమాని శ్రీనివాస్‌లకు చెందిన ఈ పొలం దస్తావేజులతో రుణం తీసుకునేందుకు మండలంలోని ఒక బ్యాంకుకు వెళ్లారు. అక్కడ బ్యాంకు అధికారులు వారి దస్తావేజులు పరిశీలించి ఈ సర్వే నంబర్‌లపై నరసాపురం సెంట్రల్ బ్యాంకులో రుణం వేరొకరు పొందినట్టు ఉందని చెప్పడంతో వారు షాక్ అయ్యారు. వెంటనే సెంట్రల్ బ్యాంకుకు వచ్చి నిలదీయడంతో అసలు విషయం గుట్టురట్టయ్యింది. బాధిత రైతులు ఆ సమయంలో ఫిర్యాదు చేయలేదు. కొందరు పెద్దల సమక్షంలో సెటిల్‌మెంట్ చేసేందుకు ప్రయత్నించారు. తాజాగా రైతు తిరుమాని నాగరాజు కేసు పెట్టడం చర్చనీయాంశమైంది.



నేడు ప్రపంచ టీ దినోత్సవం

ఆహార పానీయాల్లో ఒకప్పటి ఔషధంగా ప్రాచుర్యం పొందిన, పురాతనమైన టీ నేటికి చెక్కు చెదరని ఆదరణ, వినియోగం వుంది. ప్రపంచ వ్యాప్తంగా వున్న జనాభాలో కోట్లాది మంది తెల్లవారగానే టీ తాగకుండా ఏ పని చేయలేని వారు కూడా వున్నారంటే అతిశయోక్తి కాదు. తేనీరుగా ఆసియా రాజకుటుంబాలలో ప్రసిద్ధి చెందిన టీ.. మొదట ఆసియాలో వెలుగు చూసింది. క్రీస్తు పూర్వం 2,737 సంవత్సరాల క్రితమే టీ పానీయంగా సేవించడం ప్రజలు అలవాటు చేసుకున్నారని చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో రోమ్ కేంద్రంగా వున్న అంతర్జాతీయ వ్యవసాయం, ఆహార సంస్థ (ఎఫ్‌ఏవో) 2019 నుంచి మే 21న ప్రపంచ తేనీటి దినోత్సవంగా ప్రకటించింది. ఈ మేరకు గత ఐదేళ్లుగా మే 21న ప్రపంచ టీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

తణుకు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా తేయాకు ఉత్పత్తిలో అగ్రగామిగా వున్న భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, ఇండోనేషియా దేశాలు 2005 నుంచి ప్రతీ సంవత్సరం డిసెంబరు 15వ తేదీన అంతర్జాతీయ టీ దినోత్సవాన్ని ప్రకటించుకుని ఆ మేరకు ప్రతీ ఏడాది ఒక థీమ్‌ను ఏర్పాటు చేసుకుని ప్రచారం నిర్వహించేవి. అయితే ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 2019 నుంచి మే 21న ప్రపంచ టీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. టీని పానీయంగా స్వీకరించడంలో క్రీస్తు పూర్వం 4 శతాబ్దంలో చైనాకు చెందిన వైద్యులు వైద్య పరీక్షల కోసం చెట్ల ఆకులను ఎండబెట్టి వేడి నీటిలో మరిగించగా వచ్చిన కషాయాన్ని వైద్య పరీక్షల కోసం ఓ వ్యక్తి తాగాడు. ఆ కషాయాన్ని తాగడం వల్ల అతను ఉత్తేజాన్ని పొందాడని చెబుతారు. అలా నాగరిక ప్రపంచానికి టీ పరిచయమైందని చెబుతారు. టీ జపాన్ నుంచి యూరప్‌కు వ్యాపించింది.

- ఆధునిక యుగంలో కొన్ని టీ తోటల సాగు నుంచి టీ పొడి మార్కెట్ చేసే సంస్థలు మన దేశంలోని గ్రామీణ ప్రజలకు టీ పానీయంగా ఉచితంగా అందించి తమ వ్యాపార ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేవని ఆర్థిక వేత్తల అభిప్రాయం. ఒకప్పుడు పెద్ద హోటల్స్‌లో మాత్రమే అందుబాటులో వుండే టీ, నేడు ప్రత్యేకంగా టీ అమ్మే షాపులు ఏర్పాటు జరిగింది. ఒకప్పుడు ఇంటిలో మాత్రమే తాగే టీ నేడు ప్రతీ పల్లెలో ఆధునిక హంగులతో టీ షాపులు వెలుస్తున్నాయి. ఒకప్పుడు ఇళ్లల్లో, బయట హోటల్స్‌లో టీ అంటే పాలు, టీ పొడి, పంచదార లేక బెల్లంతో మాత్రమే తయారు చేసే వారు. ప్రస్తుతం టీ షాపుల్లో అనేక రకాల రుచులతో కూడిన టీలు అందుబాటులోకి వచ్చాయి. టీ పొడి ఆధారంగా అనేక పదార్థాలతో కూడిన ప్రత్యేక రుచులతో టీ రకాలు మార్కెట్‌లో అందుబాటులో వున్నాయి.

గుండె జబ్బులు తగ్గుతాయి

మనిషి టీ తాగడం ద్వారా టీలో వుండే క్యాటెచిన్స్, పాలిఫెనోల్స్ శరీరంలోని కణ నష్టాన్ని తగ్గిస్తాయి. కొలెస్ట్రాల్ తగ్గించడంతో గుండె జబ్బులకు ఔషధంగా పనిచేసి తగ్గిస్తుంది. ముఖ్యంగా టీ తాగగానే నూతన ఉత్తేజం పొందడంలో కొంత రిలాక్స్ పొందుతారు. ప్రస్తుత రోజుల్లో టీ అనేక రూపాలలో వ్యాపారం విస్తరించింది. టీ, బెల్లం టీ, బెల్లం మిరియాలు, బెల్లం అల్లం, మసాలా టీ, లెమన్ టీ, గ్రీన్, వంటి అనేక రూపాలలో టీ అమ్మకాలు సాగుతున్నాయి. ధర కూడా కనీసం రూ. 10 నుంచి గరిష్ఠంగా రూ.30 వరకు టీ రకాలను బట్టి అమ్మకాలు జరుగుతున్నా యి. టీ అమ్మకాల కోసం అనేక కార్పొరేట్ స్థాయి సంస్థలు టీ టైమ్, టీ ట్రీ, వంటి సంస్థలు ప్రతీ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా తమ శాఖలను ప్రారంభించి టీలోని అనేక రుచులతో పాటు ఇతర ఆహార పదార్థాలను అమ్ముతూ ఒక్కో షాపులో ఇద్దరు నుంచి ఐదుగురు వ్యక్తులు ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నారు.

50 ఏళ్లుగా టీ అమ్ముతున్నా..



తణుకులో 1978 నుంచి టీ అమ్ముతూ జీవిస్తున్నా. మొదటిలో 20 పైసలకే గ్లాస్ టీ అమ్మేవాళ్లం. 1983 నాటికి 30 పైసలకు పెంచాం. ప్రస్తుతం పాలు, టీ పొడితో పాటు బెల్లం, అల్లం, మిరియాలు కలిపి టీ చేస్తున్నాం. టీ రూ.10, 12గా అమ్ముతున్నాం. మొదటిలో లీటరు పాలు రూ. 9, టీ పొడి కిలో రూ. 50, ప్రస్తుతం పాలు లీటరు రూ. 64, టీ పొడి రూ.250 నుంచి రూ.300గా వుంది. రోజు వారీ ఆదాయానికి ఇబ్బంది లేదు. జీవితం సంతృప్తిగానే వుంది.

- తాడాల రమణ, టీ దుకాణం నిర్వాహకుడు, తణుకు.

టీ-మాస్టర్‌గా ఉపాధి



రోజు రోజుకు టీ పానీయంగా వినియోగం పెరగడంతో టీ షాపులలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. పట్టణాలు, జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన టీ షాపుల్లో అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. గత ఏడేళ్లుగా టీషాపులో టీ మాస్టర్‌గా చేస్తున్నా. కరోనా కాలంలో కూడా పనిచేసి కుటుంబాన్ని పోషించుకున్నా.

- నక్కా సుబ్రహ్మణ్యం, టీ మాస్టర్, తేతలి

టీ ఆరోగ్యానికి మంచిదే..



రోజూ టీ తాగడం ఆరోగ్యానికి మంచిదే. మొదటిలో టీ ఒక ఔషధంగా ఉపయోగించారు. తర్వాత రోజువారీ పానీయంగా మారిపోయింది. టీలో వుండే క్యాటెచిన్స్ వంటి పాలిఫెనోల్స్ ఉన్నందున అవి శరీరంలోని కణ నష్టాన్ని తగ్గించి శరీరం ముడతలు, వృద్ధాప్యాన్ని తగిస్తుంది. గుండె ఆరోగాన్ని మెరుగుపరుస్తుంది, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఎల్ థియానిన్, క్యాఫిన్ కలిపి మెదడు చురుకుదనాన్ని పెంచుతుంది. పెప్పరమెంట్, అల్లం టీలు అజీర్తి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. గ్రీన్ టీ మెటబాలిజాన్ని వేగవంతం చేసి బరువు తగ్గడానికి తోడ్పడుతుంది. టీలోని యాంటీఆక్సిడెంట్లు కొన్ని కేన్సర్ల ముప్పును తగ్గించగలవు.

-పెదపాటి గోపాలకృష్ణప్రసాద్ పోషకాహార నిపుణులు, తణుకు.

అనర్హుల చెంతకు 'ఆదరణ-2' పనిముట్లు

» 2018-19లో వైసీపీ కార్యకర్తల చేతుల్లోకి లబ్ధిదారుల యూనిట్లు

» ఎమ్మెల్యే చింతమనేని ఫిర్యాదు.. కలెక్టర్ ఆదేశాలతో విచారణ

పెదవేగి, మే 20(ఆంధ్రజ్యోతి): కులవృత్తితో జీవనం సాగించే పేదలకోసం ప్రభుత్వం చేపట్టిన ఆదరణ-2 పథకం యూనిట్లు చేతులు మారాయి. తమ వాటా సొమ్ము చెల్లించి, పనిముట్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. అసలు లబ్ధిదారులను పక్కనబెట్టి, కొందరు వ్యక్తులు ఆ యూనిట్లను చేజిక్కించుకున్నారు. దీనిపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఫిర్యాదుతో, కలెక్టర్ వెట్రిసెల్వీ ఆదేశాలతో పెదవేగి మండలంలో పలుగ్రామాల్లో మంగళవారం క్షేత్రస్థాయి విచారణ నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి, బీసీ వెల్ఫేర్ అధికారిణి ఆర్.నాగరాణి, జిల్లా పరిషత్ సీఈవో భీమేశ్వరరావులతో కూడిన త్రీమెన్ కమిటీ పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ విచారణలో అసలు లబ్ధిదారులను పక్కనబెట్టి, మధ్యలో అనర్హులైన వారికి వైసీపీ నాయకులు ఆదరణ-2 పనిముట్లను పంపిణీ చేసినట్లు తెలుసుకున్నారు. 2018-19 ఏడాదికి సంబంధించి అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ-2 పథకానికి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని, వారి వాటాసొమ్ము డీడీల రూపంలో చెల్లించారు. యూనిట్లు మంజూరై, పనిముట్లు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చాయి. ఈలోగా ఎన్నికలకోడ్ అమలులోకి రావడంతో పనిముట్లను లక్ష్మీపురంలోని దెందులూరు మార్కెట్ యార్డులో భద్రపర్చారు. అనంతరం ప్రభుత్వం మారడంతో వైసీపీ నాయకులు ఆ పనిముట్లను అసలు లబ్ధిదారులను కాదని, తమకు కావలసినవారికి పనిముట్లను అప్పజెప్పినట్లు విచారణలో గుర్తించారు. మొత్తం 132 యూనిట్లను అనర్హులైన 82మందికి పంపిణీ చేసినట్లు గుర్తించి, వాటిపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. విచారణ పూర్తిచేసిన తరువాత తదుపరి చర్యలు ఉంటాయని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ భీమేశ్వరరావు తెలిపారు. ఈ విచారణలో త్రీమెన్ కమిటీతోపాటు పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి



కొప్పులవారిగూడెంలో విచారణ సిబ్బంది

క్రైమ్ కార్నర్

యువకుడి ఆత్మహత్య



అఖిల్‌బాబు (ఫైల్)

ఏలూరు క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఏ కారణమో తెలియదు కాని ఒక యువకుడు ఎలుకల మందు బిళ్లలు వేసుకుని మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీమడోలు మండలం చెట్టున్నపాడుకు చెందిన మాగాబత్తిన మిల్కీయర్ తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి దెందులూరు మండలం దోసపాడు గ్రామ పరిధిలోని చేపల చెరువుపై కాపలా ఉంటున్నాడు. చిన్న కుమారుడు అఖిల్ బాబు (17) మంగళవారం సాయంత్రం ఎలుకలు నివారణకు వేసే బిళ్లలను మింగేశాడు. కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా ఆసుపత్రి వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె ఇంటికెళ్లొచ్చేసరికి చోరీ

ఏలూరు క్రైం : తలుపులకు గడియపెట్టి కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి దొంగలు ఆ ఇంట్లోని నగదు, బంగారపు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు రామకృష్ణాపురంలో వీరంకి వెంకటలక్ష్మి నివాసం ఉంటున్నారు. ఆమె కుమారుడు వేరే ఊరులో తన కుటుంబంతో ఉంటుండగా ఆమె కుమార్తె ఏలూరులోని అదేప్రాంతంలో మరో ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈనెల 17వ తేదీ రాత్రి ఆమె తన ఇంటి తలుపులు దగ్గరకు వేసి గడియపెట్టి కుమార్తె ఇంటికి వెళ్లి మరుసటి రోజు మధ్యాహ్నం వచ్చారు. వచ్చేసరికి ఆ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. ఇంట్లో టేబుల్‌పై పెట్టిన రూ.25 వేల నగదు, అరకాసు బంగారపు ఆభరణాలు అపహరణకు గురైనట్లుగా గుర్తించారు. ఈ ఘటనపై మంగళవారం ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు వ్యాన్‌లు ఢీ.. యువకుడి మృతి

» వ్యాన్‌లో చిక్కుకున్న వ్యాన్ డ్రైవర్, భార్య

» బయటకు తీసి ఆసుపత్రికి తరలించిన పోలీసులు

ఏలూరు క్రైం/భీమడోలు, మే 20(ఆంధ్రజ్యోతి) :భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలోని హైవేపై వ్యానులో ప్రయాణికులు ఎక్కుతుండగా వెనుక నుంచి మరో మినీ వ్యాన్ ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. రావులపాలెం నుంచి గుంటూరు వెళుతున్న మరో మినీ వ్యాన్ ఆగి ఉన్న వ్యానును మంగళవారం రాత్రి ఢీకొట్టింది. సోదరుడిని వ్యాను ఎక్కించేందుకు వచ్చిన ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామానికి చెందిన కోడూరి వెంకట రామ్ చరణ్(17) అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొన్న వ్యాన్‌లోని డ్రైవర్ కం ఓనర్ అయిన గుంటూరు జిల్లా తుమ్మల పాలెంనకు చెందిన మామిడి జైరావు, అతని భార్య ప్రశాంతి వ్యానులో చిక్కుకున్నారు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బయటికి తీసి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామ్‌చరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భీమడోలులో తిరగబడిన ఆటో..

సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలు



లైన్ గోపాలపురంలో అదుపుతప్పి తిరగబడిన వాహనం..

అంబులెన్స్‌లో క్షతగాత్రులకు వైద్యం

వేర్వేరు చోట్ల 28 మంది కూలీలకు గాయాలు

» భీమడోలు హైవేపై ఆగి ఉన్న ఆటోలను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

» 14 మంది ఉపాధి కూలీలకు గాయాలు.. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలు

» లైన్ గోపాలపురం హైవేపై ఎండు కొబ్బరి లోడు వాహనం బోల్తా

» 14 మంది కూలీలకు గాయాలు.. వీరిలో ఐదుగురికి తీవ్ర గాయాలు

భీమడోలు, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల కోసం కూలీలతో వెళుతున్న రెండు ఆటోలను ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో పది మంది మహిళలకు స్వల్పగాయాలు, నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన భీమడోలు హైవే అయ్యప్పస్వామి గుడి సమీపంలో జరిగింది. మంగళవారం తెల్లవారు జామున ఉపాధి పనులకు రెండు ఆటోల్లో కూలీలు తరలి వెళ్లారు. ఉదయం వర్షం వచ్చిన కారణంగా ఆటోల నుంచి కిందకు దిగకుండా ఉన్న కూలీలు ప్రయాణిస్తున్న ఆటోలను కాకినాడ వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు ఉన్న ఆటో బోల్తా కొట్టింది. ఆటోలో ఉన్న 14 మందికి గాయాలయ్యాయి వీరిని భీమడోలు సామాజిక వైద్య కేంద్రానికి తరలించారు. వీరిలో తీవ్ర గాయాలైన నలుగురిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టైరుపేలి కొబ్బరి లోడు వాహనం బోల్తా..

ద్వారకాతిరుమల : ఎండుకొబ్బరి లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం వెనుక టైరు పేలడంతో అదుపుతప్పి తిరగబడిన ఘటన లైన్ గోపాలపురం జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలివి.. మండలంలోని కప్పలకుంట పరిసర ప్రాంతాల నుంచి కొబ్బరికాయలను పోగుచేసి పెదవేగి మండలం వేగవరానికి ఎండు కొబ్బరిలోడుతో బొలెరో వాహనం వేగవరం, గోపన్నపాలెం గ్రామాలకు చెందిన 14 మంది కూలీలతో వెళ్తోంది. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి వాహనం వెనుక టైరు పేలి అదుపు తప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. డ్రైవర్ వాన కిషోర్‌తో పాటు వాహనంపై ఉన్న కూలీలలో 14 మంది గాయాలపాలయ్యారు. వీరిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తొలుత భీమడోలు ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం నిమిత్తం తీవ్ర గాయాలైన ఐదుగురిని ఆంజనేయులు, సంతోష్, అప్పలనాయుడు, సత్యవతి, గంగాధరరావులకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉద్యాన డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

తాడేపల్లిగూడెం రూరల్, మే20 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల ఉద్యాన డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 528 సీట్లు ఉన్నట్టు ఉద్యాన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తెలిపారు. దరఖాస్తులు యూనివర్సిటీ వెబ్‌సైట్ https://drysrhu.ap.gov.in/ డౌన్‌లోడ్ చేసుకుని ఆఫ్‌లైన్ పద్ధతిలో సమర్పించాలని సూచించారు.

వెబ్‌సైట్‌లో ఉమ్మడి జిల్లా వైద్య ఉద్యోగార్థుల మెరిట్ జాబితా

ఏలూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో ఎన్‌యూహెచ్‌ఎం పథకంలో కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయతలపెట్టిన గ్రేడ్-2 ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాలను జిల్లా వెబ్‌సైట్లలో పొందుపర్చినట్టు ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని తెలిపారు. జాబితాల్లోని అభ్యర్థుల వివరాలపై ఏమైనా అభ్యంతరాలుంటే తగిన ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోగా ఏలూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేటి నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీలకు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడిపశ్చిమ జిల్లాలోని ప్రభుత్వ/ జడ్పీ/ మున్సిపల్/ మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియను బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మ్మ తెలిపారు. నిర్ణీత గరిష్ట స్టేషన్ సర్వీసు పూర్తిచేసిన వారు తప్పనిసరి బదిలీకోసం, అభ్యర్థన బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే వారు బుధవారం నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు.

నేరస్థుడైన జగన్‌కు నా పేరెత్తే అర్హత లేదు

» మంత్రి డాక్టర్ నిమ్మల

యలమంచిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): 'రాజకీయాల ముసుగులో నేరస్థుడైన జగన్‌కు తన పేరు ఎత్తే అర్హత లేదని, తనకూ జగన్‌కు నక్కకు నాగ లోకానికి ఉన్నంత తేడా ఉంది' అని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. 'మన రైతు మన రామానాయుడు' కార్యక్రమంలో భాగంగా యలమంచిలి మండలం వడ్డిలంక లక్ష్మీపాలెం, గంగడపాలెం గ్రామాల్లో రూ.2.04 కోట్లతో చేపట్టనున్న కాలువల తవ్వకం పనులు, లక్ష్మీపాలెం లాకుల గేట్లు ఏర్పాటు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ తనపై చేసిన వ్యాఖ్యలకు తీవ్రంగా స్పందించారు. జగన్ మరోసారి గెలిచి ఉంటే ఆంధ్రప్రదేశ్ ప్రజల ఒంటటిపై గోచి కూడా ఉండేది కాదని విమర్శించారు. తండ్రి పేరు అడ్డుపెట్టుకుని రూ.లక్షల కోట్లు అక్రమార్జనలు చేసి 11 చార్జిషీట్‌లలో నిందితుడైన జగన్ 16 నెలల జైలులు శిక్ష అనుభవిండని విమర్శించారు. జగన్ అధికారంలోకి వచ్చాక సొంత మాఫియాను పెట్టుకుని ప్రజా ధనాన్నా లూటీ చేశారని విమర్శించారు. ఎంతో నిబద్ధతతో తన తండ్రి పేరుమీద ఫౌండేషన్ ప్రారంభించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రాజకీయాల్లోకి వచ్చానన్నారు. కార్యక్రమంలో మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపాలరావు, బోణం నాని, ఆరిమిల్లి రామశ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు, మే 20(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ కార్యాలయంలో వృద్ధులకు ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. మంగళవారం డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు 26 మందికి పరీక్షలు చేసి నివేదికలు అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, సాయి, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా చూడాలి

అత్తిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): రెండు, మూడు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్ర పరుచుకోవాలని అత్తిలి వ్యవసాయాధికారి టీకే రాజేష్ కోరారు. రాశులపై ఉన్న ధాన్యాన్ని త్వరగా కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని, ధాన్యాన్ని చేలలో ఉంచకుండా దగ్గరలోని ఎత్తైన ప్రాంతాలు లేదా దిమ్మెలపై భద్రపరచుకోవాలని కోరారు.



ఆకివీడులో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

పాకిస్థాన్‌కు సత్తాచూపిన భారత్

ఆకివీడు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌కు ప్రధాని మోదీ భారత్ సత్తా చూపారని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక నెహ్రూజీ సెంటర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించి మాట్లాడారు. పార్టీలకతీతంగా కేంద్రానికి అందరూ అండగా నిలవాలన్నారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, భూపతిరాజు తిమ్మరాజు, నౌకట్ల రామారావు, గంధం ఉమా తదితరులు ఉన్నారు.


మహిళలకు చీరలు అందిస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిన టంగుటూరి

భీమవరం టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్ర ప్రగతికి బాటలు వేశారని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, ముదునూరి మురళీ మోహన్ రాజు అన్నారు. క్విట్ ఇండియా స్థూప కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి వర్ధంతిని పురస్కరించుకుని క్విట్ ఇండియా స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిర్వాహకుడు రంగసాయి మాట్లాడుతూ భీమవరంతో టంగుటూరికి సత్సంబంధాలున్నా ఆయన విగ్రహం ప్రకాశం చౌక్ లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. అనంతరం న్యూటన్ సౌజన్యంతో మహిళలకు చీరలను అందించారు. రిటైర్డ్‌పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాగిరాజు సత్యనారాయణ రాజు, కార్యదర్శి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

తణుకు: కామేష్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం తణుకులోని వైఎస్ ఆర్ పార్కు వద్ద గల టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ నాయకుడు సూరంపూడి వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో వార్డు బాట

పెంటపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జనసేన, బీజేపీ పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, దువ్వ శ్రీను అన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మైలవరపు రాంజేంద్రప్రసాద్, పడాల శ్రీను ఆధ్వర్యంలో పట్టణంలోని 33 వార్డులో వార్డు బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో సమస్యలను పరిశీలించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకవెళ్తామన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కల్వర్ట్‌ను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

రోగికి ఎమ్మెల్యే బొలిశెట్టి ఆర్థిక సాయం



తాడేపల్లిగూడెం అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎవరికే కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన సత్తి వెంకట శివరాజు లివర్ వ్యాధితో బాధపడుతుండడంతో మంగళవారం ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి రూ. 20 వేలు అందజేసారు. వర్తనపల్లి కాశి, పైబోయిన రఘు, అడపా ప్రసాద్, పైబోయిన వైదేహి, కటికిరెడ్డి లీలాశివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కార్డుల పంపిణీ

ఏ పార్టీకైనా కార్యకర్తలే బలమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో జనసైనికులకు సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. జనసైనికులు వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, అడపా ప్రసాద్, బైనపాలెపు ముఖేష్, పైబోయిన వెంకట్రామయ్య, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసరాల వితరణ



తణుకు, మే 20(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో వృద్ధ కళాకారులకు దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. మంగళవారం సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నేత్ర వైద్యుడు డాక్టర్ హాస్సేన్ అహ్మద్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎండీ స్వాలిహా కోశాధికారి అర్థి భాస్కరరావు, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల ఆందోళన

నరసాపురం/అత్తిలి, మే 20(ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 4ను వ్యతిరేకిస్తూ మంగళ వారం పట్టణ, మండలంలోని వీఆర్వోలు ఆందోళనకు దిగారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో దాసిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ కొత్త జీవో వల్ల వీఆర్వోలపై పనిభారం పెరిగే ప్రమాదం ఉందన్నారు. జీవో నంబర్ 4 విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతూ అత్తిలి మండల వీఆర్వోలు, అత్తిలి తహసీల్దార్ వంశీకి వినతిపత్రం అందజేశారు.


తణుకులో జరిగిన సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

తణుకు మండల పాస్టర్ల సమావేశం

తణుకు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లు సమాజాభివృద్ధికి బాధ్యతతో మెలగాలని బిషప్ డాక్టర్ ఎం. హారత్ బాబు చెప్పారు. మంగళవారం తణుకులోని లివింగ్ క్రాస్ చర్చిలో జరిగిన తణుకు మండల పాస్టర్స్ సంఘ సమావేశం సంఘ కార్యదర్శి యేసురత్నం అధ్యక్షతన జరిగింది. ఇటీవల మృతి చెందిన అజ్జరం పాస్టర్ పరిశుద్ధ పాల్ కుటుంబానికి సంఘం తరఫున ఆర్థిక సాయం చేశారు. అధ్యక్షుడు పీడీ ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షుడు వై స్పర్జన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


ఆచంట మినీ మహానాడులో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పితాని నివాళి


ఆకివీడు మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజశేఖర్

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఆచంట మినీ మహానాడులో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

టీడీపీని ఏమీ చేయలేరు : ఆకివీడులో ఎమ్మెల్సీ రాజశేఖర్

ఆచంట, మే 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిశలు పాటుపడిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని అధైర్యపడవద్దని ఆచంట నియోజకవర్గ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట కమ్మ కల్యాణ మండపంలో మంగళవారం ఎమ్మెల్యే పితాని ఆధ్వర్యంలో మినీ మహానాడు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉగ్ర దాడుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెట్టారన్నారు. వారికి వచ్చే సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. జగన్ పాలనలో జరిగిన లిక్కర్ మాఫియాపై విచారణ జరుగుతోందన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మిస్తామన్నారు. త్వరలోనే తల్లికి వందనం కార్యక్రమం చేపడతామన్నారు. కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడు కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, కూటమి నాయకులు శ్రేయోభిలాషులు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, నియోజకవర్గ పరిశీలకులు వెంకట రామరాజు, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ సూర్య కుమారి, పార్టీ మండల అధ్యక్షుడు కేతా మీరయ్య, తమ్మినీడి ప్రసాద్, బీరా నరసింహమూర్తి, గొడవర్తి శ్రీరాములు, సిర్రా బాలాజీ, జక్కంశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నీటి సంఘం అధ్యక్షులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకివీడు: తెలుగుదేశం పార్టీని ఎవరూ ఏమీ చేయలేరు. టీడీపీకి రాజకీయ భవిష్యత్ లేకుండా చేయాలనుకున్న వారికే భగవంతుడు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేశారని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో టీడీపీ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో పార్టీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ అధ్యక్షతన మినీ మహానాడు నిర్వహించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని, కొల్లేరు జీవోతో ఇబ్బందులు పడిన రైతులను ఆదుకోవాలని తీర్మానాలు చేశారు. రాజశేఖర్, పరిశీలకుడు నాగబాబు మాట్లాడుతూ దేశంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వ్యక్తి సీఎం చంద్రబాబు అన్నారు. వైసీపీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తే కూటమి ప్రభుత్వం పది నెలల్లో చక్కదిద్ది అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు దూసుకుపోతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. బీసీ, ఎస్సీలకు అత్యున్నత పదవులు ఇచ్చిన పార్టీ టీడీపీ అన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ప్రథమంగా నిలిపారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిన కార్యకర్తలు బెదరలేదన్నారు. జగన్ చేసిన విధ్వంసాన్ని రాష్ట్ర ప్రజలు మరువలేకపోతున్నారన్నారు. అనంతరం మండల, పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రాజశేఖర్, పరిశీలకుడు నాగబాబుతో పాటు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన దగ్గర నుంచి ఆకివీడులో ప్రజల నుంచి రూ.5లు కూడా తీసుకోకుండా అన్న క్యాంటీన్ నడిపిస్తున్న దాత గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజును ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, ఉండి నియోజకవర్గ టీడీపీ కుటుంబ సభ్యులు ఉన్నారు.



తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా



నరసాపురం అంబేద్కర్ సెంటర్ వద్ద సీఐటీయూ ధర్నా

లేబర్ కోడ్‌లను రద్దుచేయాల్సిందే

సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా

తాడేపల్లిగూడెం రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి మండలపర్తి హరీష్, అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద నిరసన తెలిపారు. సీఐటీయు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తణుకు: కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం నరేంద్ర సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: కార్మిక చట్టాలను కాలరాస్తూ కేంద్రం కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను తక్షణం రద్దు చేయాలంటూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేశారు. యూనియన్ జిల్లా నాయకుడు ఎం. త్రిమూర్తులు మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులు, చట్టాలను కేంద్రం కార్పొరేట్ సంస్థలకు తలొగ్గి కొత్త సంస్కరణలు తీసుకొస్తోందన్నారు. కొండ, లక్ష్మణ్, సత్తిబాబు, ప్రసాద్, దుర్గారావు, మల్లేష్‌లు పాల్గొన్నారు.

పెనుగొండ: కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పెనుగొండ పంచాయతీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక వైఖరి నిరసిస్తూ కార్మికులు, ఉద్యోగులు అంతా జూలై 9న జరిగే సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. నాగిశెట్టి గంగారావు, సహాయ కార్యదర్శి తులసి, అంగన్‌వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

ఆకివీడు: లేబర్ కోడ్లు రద్దుచేసి ఎనిమిది గంటలు పనిదినాలు అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ సెంటర్‌లో కార్మికులతో కలిసి ధర్నాచేసి మాట్లాడారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయా లన్నారు. కార్మికులను ఉపాధి అవకాశాలు కల్పించి, కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలన్నారు. హామీలు అమలు చేయకపోతే జూలై 9న దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని హెచ్చరించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు పెంకి అప్పారావు, నెల్లి సూరిబాబు, నిమ్మల శ్రీను, నక్కాని సత్యనారాయణ, దండు వాసురాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

పెంటపాడు: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు సిరపరపు రంగారావు, చిర్లా పుల్లారెడ్డి, దూలం ప్రసాద్, బంకూరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పెంటపాడు గాంధీబొమ్మ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

తణుకు, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడాలని కాంగ్రెసు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ రాజు అన్నారు. మంగళవారం పట్టణంలో కాంగ్రెసు పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో రాహుల్ గాంధీ ఆవిష్కరించిన న్యాయ సూత్ర ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దిర్శిపో రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

అత్తిలి, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యానికి చిరు ధాన్యాలు దోహదం చేస్తాయని రిసోర్స్ పర్సన్ టి.నారాయణరావు అన్నారు. అత్తిలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు చిరు ధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. విద్యార్థులతో కథలు చెప్పించారు. పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయా ధికారి డి. కృష్ణారావు, వి లక్ష్మణరావు, గంధం శేషవేంద్ర రావు, ఎస్ దుర్గా ప్రసాద్, వై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

తణుకు, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణ పేదలకు రెండు సెంట్లు స్థలం వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీవీ ప్రతాప్ కోరారు. మంగళవారం తహసీల్దార్ అశోక్‌వర్మకు వినతి పత్రం అందజేశారు. టిడ్కో ఇళ్ళు ఇప్పటికీ పూర్తికాకపోవడం వల్ల లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



శ్రీవారికి బంగారం బహూకరణ

భీమవరం టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి వారికి సోమవారం దాతలు 8 గ్రాముల బంగారాన్ని బహూకరించారు. రాజమహేంద్రవరానికి చెందిన పాలడుగుల ఆంజనేయులు, అన్నపూర్ణాదేవి దంపతులు బంగారాన్ని ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజుకు అందించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు దాతలకు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు.


పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

ఆసుపత్రిలో ప్రసవాలు పెంచాలి

పెనుగొండ, మే 20(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో ప్రసవాలు పెంచాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జి. గీతా బాయి అన్నారు. సిద్ధాంతం పీహెచ్‌సీని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. హైరిస్క్ తల్లుల జాబితాను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం క్షేత్ర స్థాయిలో ఎన్‌సీడీ సీడీ సర్వే వివరాలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నివారించాలి

ఆకివీడు, మే 20 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నివారించాలని బాలల రక్షణ జిల్లా అధికారి రాజేష్ అన్నారు. మంగళవారం ఎంపీడీ వో కార్యాలయంలో ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు బాలికల అక్రమ రవాణా, బాల కార్మికుల నివారణపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని వాణి విజయరత్నం, సూపర్‌వైజర్ రత్నకుమారి తదితరులు ఉన్నారు.

వైభవంగా దేశాలమ్మ జాతర

పాలకొల్లు అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): స్థానిక లాకుల వద్దగల దేశాలమ్మ జాతర ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం అమ్మవారిని రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం రాత్రి జాతరను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల జనార్ధన శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

జీఎన్‌వి కెనాల్ ప్రక్షాళన

మొగల్తూరు, మే 20(ఆంధ్రజ్యోతి): జీఎన్‌వి కెనాల్ శివారు ప్రాంతంతో కాలువ ప్రక్షాళన పనులు మంగళవారం చేపట్టారు. మండలంలోని జగన్నాథపురం పంచాయతీ ఉన్నత పాఠశాల వంతెన నుంచి కాళీపట్నం లాకు వరకూ నాలుగు కిలోమీటర్ల దూరం వరకూ రూ.9 లక్షల అంచనాలతో కాలువ తవ్వకం పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా డీసీ వైస్ చైర్మన్ గుబ్బల మార్రాజు, జనసేన మండల అధ్యక్షుడు కొల్లాటి గోపి మాట్లాడుతూ తణుకు నుంచి భీమవరం మీదుగా ప్రవహించే జీఎన్‌వి కెనాల్ శివారు ప్రాంతం పూడుకుపోయిందని దీంతో రైతులు, గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం ఓఅండ్‌ఎం నిధులు రూ.9 లక్షలు మంజూరు చేయడంతో కాలువ ప్రక్షాళన పనులు చేపట్టామన్నారు. రైతులు సరిపల్లి సుబ్బరాజు, నడింపల్లి రామకృష్ణంరాజు, ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రక్తదానం చేసి, బైక్ ర్యాలీ నిర్వహించి పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఇంటి కిషోర్, కట్టంగ కార్తీక్, బొద్దాని ఆదిత్య తదితరులు ఆధ్వర్యం వహించారు.

పాలకొల్లు అర్బన్: సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు నందమూరి అభిమాన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా క్షీరారామంలో పూజలు చేసిన అనంతరం కెనాల్ రోడులోని ఎన్టీఆర్ చౌక్‌వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆప్రాంతంలోని ప్రజలకు విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసారు. అభిమాన సంఘం అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పాశర్ల మాధవ్, బొప్పన చిట్టి నాయుడు, కార్యదర్శి గుడాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం

తేనెటీగల పాత్ర కీలకం

భీమవరంటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): పర్యా వరణ సమతుల్యతను కాపాడటంలో తేనెటీగల పాత్ర కీలకమని, తేనెటీగలు అంతరించిపోతే ఆహార కొరత ముప్పు తప్పదని ఎంపీడీవో ఎన్. మురళీ గంగాధర రావు, మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస రావు, పర్యావరణ శాస్త్రవేత్త ఎం. సత్యనారాయణ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం తేనెటీగలు దినోత్సవాన్ని నిర్వహించారు. మురళీ గంగాధరరావు మాట్లాడుతూ భూమిమీద తేనెటీగలు లేకపోతే మనిషి జీవితం దుర్భరమవుతుందని లండన్ శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి రోజు తగిన మోతాదులో తేనెను తీసుకోవడం వల్ల పలు అనారోగ్యాల బారి నుంచి బయటపడవచ్చునని అన్నారు. పర్యావరణాన్ని కాపాడటమే కాక మనకు ఆరోగ్యాన్ని అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్ శ్రీనివాసరావు, ఏవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మొగల్తూరులో నిలిచిన నీరు తొలగిస్తున్న దృశ్యం

అకాల వర్షంతో పాట్లు

మొగల్తూరు, మే 20(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో తీర ప్రాంత గ్రామీణ రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. అసలే గోతులు మయంగా ఉండే మొగల్తూరు-పెంప ఆర్అండ్‌బీ రహదారి, మొగల్తూరు కోట వద్ద గల పంచాయతీరాజ్ రోడ్డుతో పాటు లోతట్టు ప్రాంతాల్లోనూ వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రామన్నపాలెం అడవిపర్రలో చేతికి అందివచ్చిన సుమారు 150 ఎకరాల దాళ్వా చేలు ముంపునకు గురయ్యాయి. మామిడి తోటల్లో ఫలసాయం రాలిపోవడంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆక్సిజన్ లోపంతో మత్స్యసంపద తేలిపోవడంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారు. గోతుల్లో నిలిచిన నీటిని స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో కచ్చా డ్రెయిన్‌లు తవ్వించి నీటిని మళ్లించారు.

ఆకివీడు: ఆకివీడులో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. మురుగు రోడ్లపైకి చేరి జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణ పరిధిలోని ప్రధాన డ్రైన్లు పూడుకుపోవడంతో పాటు ఆక్రమణలకు గురవడంతో వర్షపు నీరు రోడ్లపైకి చేరి చెరువులను తలపించాయి.

ఆచంట: ఆచంట మండలంలో అన్ని గ్రామాల్లో మంగళవారం వేకువజాము నుంచి వర్షం పడుతూనే ఉంది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొద్ది రోజులుగా ఎండ, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

పెనుగొండ: మండలంలో మంగళవారం వర్షం కురిసింది. కొద్దిపాటి వర్షం కురిసినా మండలంలో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని విని యోగదారులు వాపోతున్నారు.

ఉండి: ఉండిలో భారీ వర్షం కురిసింది. రహదారులు మునిగిపోయాయి. వేసవిలో వాన కురవడంతో ప్రజలు సేదతీరారు.

పాలకొల్లు అర్బన్: సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం 11 వరకు పట్టణంలో వర్షం కురుస్తూనే ఉంది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గోతుల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నగర్ పంచాయితీ ఏరియా, ఏలూరి వారి వీధి గంగానమ్మ గుడి దగ్గర డోర్ నెం.12-25, మాదివాడ కాపురస్తులు **పాపోలు దుర్గారావు** గారి భార్య: **పాపోలు లక్ష్మీ ప్రసన్న** గార్కి చెందిన ఆకివీడు మండలం మాదివాడ గ్రామం (ఆకివీడు మేజర్ నగర్ పంచాయితీ) తాలూకా రి.స.నెం. **40/1ఎ-6 లో 0.10 ట్లు** సంబంధించిన **3322/2016 713/2015, 3453/2011, 1473/2008** నెంబర్లు గల నాలుగు ఒరిజినల్ లింక్ దస్తావేజులను నేను ఒక కవర్లో పెట్టుకుని **ది.10.05.2025** తేదిన ఇంటి వద్ద నుండి ఆకివీడు S- టర్నింగ్ దగ్గరలో జిరాక్స్ షాపుకు వెళ్తుండగా మార్గం మధ్యలో నాలుగు ఒరిజినల్ లింక్ దస్తావేజులు పెట్టిన కవర్ జారీ పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్‌కు అందించగలరు. ఈ ఆస్తి నిమిత్తం నేను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ పాలకొల్లు లో లోనుకి వెళ్తున్నాను. సదరు దస్తావేజుల నిమిత్తం ఎవ్వరికైనా అభ్యంతరములు ఉన్నట్లయితే వారు ఆ బ్రాంచి మేనేజర్ గారికి ఈ ప్రకటన వెలువడిన 10 రోజులలోగా తెలియజేయగలరు. **సెల్ : 98485 66667**